

ఐక్యవేదిక పోరాటాలకు ఎపిసిపిఎస్ఇఎ మద్దతు

ప్రజాశక్తి - తాళ్లపూడి

విద్యారంగ సమస్యలపై ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక పేరుతో చేస్తున్న పోరాటాలకు ఎపి సిపిఎస్ఇఎ(ఆంధ్రప్రదేశ్ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయీస్ అసోసియేషన్) సంపూర్ణ మద్దతు తెలుపుతుందని అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జోడల వెంకటేశ్వరరావు తెలిపారు. శనివారం తాళ్లపూడిలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఈనెల 21, 23 తేదీల్లో చేపట్టే పోరాటాలకు అసోసియేషన్ సభ్యులు పాల్గొంటారన్నారు. ప్రభుత్వం ఉద్యోగుల విషయంలో కఠినత్వాన్ని విడనాడి సమస్యలను పరిష్కరించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న డిఎలను వెంటనే విడుదల చేయాలన్నారు. పిఆర్‌సి కమిషన్‌ను ఏర్పాటు చేసి తక్షణం ఐఆర్‌ను ప్రకటించాలని ఆయన ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

పొగాకు రైతుల ఆశలు గల్లంతు

- గతేడాది పొగాకు కేజీ రూ.410 ప్రస్తుతం రూ.290
- ఎకరాలకు రూ. లక్షకు పైగా నష్టం

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

పొగాకు రైతుల ఆశలు అడియాసలవుతున్నాయి. గతేడాది కిలో పొగాకు ధర గరిష్ఠంగా రూ.410 పలికిన విషయం విధితమే. దీంతో రైతులు ఈ ఏడాది సాగును ఉత్సాహంగా ప్రారంభించారు. ప్రస్తుతం పంట దిగుబడి వచ్చే నాటికి ధరలు నేలను తాకాయి. పొగాకు కొనుగోళ్లు మార్చి 24న ప్రారంభించారు. కొనుగోలు కేంద్రాలలో ప్రస్తుతం కేజీ గరిష్ఠంగా రూ.290 మించడం లేదు. దీంతో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. తాజాగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీ అమలు కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. పాలనా యంత్రాంగం ఏ మేరకు చిత్తశుద్ధితో వ్యవహరించనుందో వేచి చూడాల్సి ఉంది.

ఈ ఏడాది బ్రెజిల్, జింబాబ్వే దేశాల్లో పంట ఉత్పత్తి గణనీయంగా పెరిగింది. దీంతో అంతర్జాతీయ మార్కెట్లో డిమాండ్ కొరవడింది. గతేడాది ధరలు ఆశాజనకంగా ఉండటంతో రైతులు లాభాలొస్తాయని ఆశించి ఈ ఏడాది ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేశారు.



పొగాకు బేళ్లు

ఎకరాకు రూ.లక్ష నష్టపోయే ప్రమాదం

గతేడాది ఆశాజనకంగా ధరలు ఉండటంతో ఈ ఏడాది కూడా అవే ధరలు ఉంటాయని భావించాను. కాని పరిస్థితి పూర్తిగా తలకిందులైంది. పదెకరాల్లో వర్జీనియా పొగాకు సాగు చేశాను. సాగు ఖర్చులు, కౌలు ఖర్చులు పెరగటంతో ఎకరాకు రూ.2.50 లక్షలు పెట్టుబడి ఖర్చు అయింది. ప్రస్తుత ధరల ప్రకారం ఎకరాకు రూ. లక్ష నష్టం వచ్చే పరిస్థితులున్నాయి. ప్రభుత్వం చొరవ చూపించి గిట్టుబాటు ధర కల్పించేలా చర్యలు చేపట్టాలి.

\- అనపర్తి శ్రీనివాస్, దేవరపల్లి, పొగాకు రైతు

అయితే పరిస్థితులు తలకిందులవడంతో నష్టాలను చవి చూస్తున్నారు. జిల్లాలోని గోపాలపురం, దేవరపల్లి, రాజమండ్రి రూరల్‌తో పాటు పశ్చిమ గోదావరి జిల్లాలోని నాలుగు మండలాల్లో పొగాకు సాగు విస్తీర్ణం ఈ ఏడాది గణనీయంగా పెరిగింది. పై మండలాల్లో 14,754 మంది రైతులు 12,723 బేరన్లు రిజిస్ట్రేషన్ చేయించుకోగా సుమారు 29,450 హెక్టార్లలో పొగాకు సాగు చేసినట్లు అధికారికంగా లెక్కలు చెబుతున్నాయి. అయితే రిజిస్ట్రేషన్లు లేకుండా మరో 10వేల హెక్టార్లలో రైతులు పొగాకు సాగు చేశారు. తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలో దేవరపల్లి, గోపాలపురం, కొయ్యలగూడెంలలో ఒక్కొక్కటి, జంగారెడ్డిగూడెంలో రెండు మొత్తం 5 పొగాకు వేలం కేంద్రాలు ఉన్నాయి. ఈ వేలం కేంద్రాల పరిధిలో 59 మిలియన్ల పొగాకు ఉత్పత్తికి బోర్డు అనుమతి ఇచ్చింది. ప్రతి ఏటా కేజీ సగటున రూ.180 నుంచి రూ.200 మించిన దాఖలాలు లేవు. గత ఏడాది అంతర్జాతీయ మార్కెట్‌లో డిమాండ్ ఏర్పడటతో వ్యాపారులు పోటీపడి కొనుగోలు చేశారు. ఒక దశలో కేజీ రూ.280 పైచిలుకు కూడా కొనుగోళ్లు జరిగాయి. అయితే సగటున రూ.248.41 చొప్పున కొనుగోలు జరిగాయి. జిల్లాలో టుబాకో బోర్డు ఏర్పాటు చేసిన తర్వాత ఈ ధరే అత్యధికమని అధికారులు చెబుతున్నారు.

గతేడాది ఏర్పడిన డిమాండ్ నేపథ్యంలో ఈ ఏడాది అత్యధిక మంది వర్జీనియా పొగాకునే సాగు చేశారు. అయితే క్యూరింగ్ ప్రారంభంలో 70 మిలియన్ల కిలోల పొగాకు ఉత్పత్తి అవుతుందని అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. ప్రస్తుతం క్యూరింగ్ ముగింపు దశకు చేరుకుంటే 80 మిలియన్ల కిలోల వరకూ ఉత్పత్తి రానుందని అధికారులు అంచనా వేశారు గత ఏడాదితో పోల్చుకుంటే పొగాకు సాగు ఖర్చులు 20 నుంచి25 శాతం వరకూ పెరిగాయి. ఎకరం భూమికి కౌలు రూ.70 వేలు, బేరన్ అద్దె రూ.1.60లక్షలకు తీసుకుని సాగు చేశారు. ఎకరాకు సుమారు రూ.2.50 లక్షల పెట్టుబడి పెట్టారు. పొగాకు సాగు చేస్తున్న రైతుల్లో 80 శాతం కౌలు దారులే ఉన్నారు. రోజులు గడుస్తున్న ధరలో పెరుగుదల, కొనుగోళ్లు ఆశాజనకంగా లేకపోవడంతో రైతులు నిరాశ చెందుతున్నారు. సాగు ప్రారంభంలో మిచౌంగ్ తుఫాన్ ప్రభావంతో వర్జీనియా పొగాకు పంట దారుణంగా దెబ్బతింది. పంటను దున్నేసి మరలా మొదటి నుంచి నాట్లు వేశారు. పెట్టుబడులతో పాటు అధిక ధరలకు నారు కొని సాగు చేయడంతో పెట్టుబడి ఖర్చు విపరీతంగా పెరిగింది.ఒకవైపు ప్రకృతి వైపరీత్యాలు, మరోవైపు ప్రతికూల వాతావరణం, సాగుకు అధిక పెట్టుబడులు వెరసి పొగాకు రైతులు దిక్కుతోచని పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్నారు.



డిపో మేనేజర్‌కు వినతిపత్రాన్ని ఇస్తున్న ఆర్‌టిసి అవుట్‌సోర్సింగ్ కార్మికులు

కనీస వేతనాలు చెల్లించాలి

ఆర్‌టిసి డిపో మేనేజర్‌కు వినతి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

కనీస వేతనాలు చెల్లించాలని, కార్మిక చట్టాలు అమలు చేయాలంటూ సిఐటియు ఆధ్వర్యంలో కాంట్రాక్టు కార్మికులు ఆర్‌టిసి డిపో మేనేజర్‌కు శనివారం వినతిపత్రం అందించారు. సూపరింటెండెంట్(మెకానికల్) పిబిఎస్.రాజు ద్వారా ఈ వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి బివిఎన్.పూర్ణిమరాజు మాట్లాడారు. ఆర్‌టిసిలో కాంట్రాక్టు ఉద్యోగులులకు ఆర్‌టిసి సర్క్యులర్ ప్రకారం జీతాలు చెల్లించడం లేదన్నారు. నెలకు రూ.8వేలు మాత్రమే చెల్లిస్తున్నారని, ఒక రోజు సెలవు తీసుకుంటే రూ.500 తగ్గించి జీతం ఇస్తున్నారన్నారు. వీరికి కార్మిక చట్టాలు ఏవీ అమలు కావట్లేదన్నారు. అంతేకాకుండా అధికారుల వీరిపట్ల బెదిరింపులకు దిగుతున్నారన్నారు. వెంటనే వీటిని ఆపాలన్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, వేసవిలో తాగునీటి వసతి కల్పించాలని డిమాండ్ చేశారు. ఆర్‌టిసి లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు, కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలన్నారు. పిఎఫ్, ఇఎస్ఐ, పెన్షన్, సాంఘిక భద్రత, ఉద్యోగ భద్రత కల్పించాల న్నారు. కాంట్రాక్టు ఉద్యోగులకు అపాయింట్‌మెంట్ లెటర్లు, పేస్లిప్‌లు అందించాలన్నారు. జీతాలు నేరుగా కార్మికుల బ్యాంకు ఖాతాలకు వేయాలన్నారు. మహిళా కార్మికులకు ప్రసూతి సెలవులు ఇవ్వాలని, లైంగిక వేధింపులు ఆపాలన్నారు. కార్మికులందరికీ 9 క్యాజువల్ లీవులు, 19 ఎర్న్ లీవులు, నాలుగు రోజులు జీతంతో కూడుకున్న వారాంతపు సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే ఈ నెల 20న జరగాల్సిన దేశవ్యాప్త సమ్మె వాయిదా పడిందన్నారు. జులై 9న ఈ సమ్మె జరుగుతుందన్నారు. కార్మికులందరకూ ఈ సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్మిక హక్కులను కాలరాస్తున్న నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.వెంకటేశ్వరరావు, కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రతిష్టాత్మకంగా రివర్ ఫ్రంట్ ప్రాజెక్ట్ అభివృద్ధి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ప్రతిష్టాత్మకంగా రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు అభివృద్ధి పనులను చేపడుతున్నామని కమిషనర్ కేతన్‌గార్గ్ తెలిపారు. ఇంజినీరింగ్ అధికారులతో కలిసి ఈ పనులను ఆయన శనివారం పరిశీలించారు. ప్రాజెక్టులో భాగంగా పివి.నరసింహరావు పార్కు, గౌతమీ నందనవనం పార్కు మధ్య కనెక్టింగ్ బ్రిడ్జి నిర్మిస్తామన్నారు. పిండ ప్రదానాలు నిర్వహించే షెడ్డును మార్చాల్సి ఉందన్నారు. ప్రజలకు ఎక్కడా అసౌకర్యం కలగకుండా మార్కండేయ ఘాట్ వద్ద ఓ స్థలాన్ని పరిశీలించామన్నారు. ఆ స్థలాన్ని తీసుకునేందుకు నీటి పారుదల శాఖకు లేఖ రాయాలని నిర్ణయించినట్లు తెలిపారు. అలాగే మార్కండేయ ఘాట్ వద్ద పిండ ప్రదానాలకు ప్రస్తుతం ఉన్న షెడ్డుకు నూతనంగా రంగులు వేసి, లైటింగ్లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఆవలో పర్యటించారు. 100 అడుగుల రోడ్డును ఎండ్ టూ ఎండ్ తరహాలో అభివృద్ధి చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. అలాగే రైతునగర్ జంక్షన్ అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ఆయన వెంట ఇఇ మదర్షా అలీ షేక్, ఇతర అధికారులు ఉన్నారు.



పనులను పరిశీలిస్తున్న కమిషనర్ కేతన్ గార్గ్

ఎస్‌సి కమిషన్ చైర్మన్ జవహర్‌కు ఘన స్వాగతం

ప్రజాశక్తి - తాళ్లపూడి

ఎస్‌సి కమిషన్ చైర్మన్ హోదాలో శనివారం మండలానికి వచ్చిన కెఎస్.జవహర్‌కు ఘన స్వాగతలం లభించింది. తాడిపూడిలో నామా సురేంద్ర ఘనంగా స్వాగతం పలికి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. అనంతరం సీనియర్ నాయకులు జడ్‌పిటిసి మాజీ సభ్యులు నామా శ్రీరాములను జవహర్ కలిశారు. బల్లిపాడు గ్రామానికి వచ్చిన జవహర్ టిడిపి సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ ఆత్కూరి రాంబాబు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం గజ్జరంలో ఇటీవల మరణించి మాజీ సర్పంచ్ రాములు కుటుంబాన్ని ఆయన పరామర్శించారు.





చిన్నారులతో నిర్వాహకులు

కాగితంతో కళాకృతులు

ప్రజాశక్తి -దేవరపల్లి

కాగితంతో చేసిన వివిధ కళాకృతులు పిల్లలను కట్టిపడేశాయి. దేవరపల్లి భాష్యం స్కూల్, పల్లంట్ల ఎంపిపి స్కూల్ ప్రాంగణాల్లో విద్యార్థులకు నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్‌ల్లో ఒరుగామి నిపుణురాలు పి.గన్నవరం మెయిన్ స్కూల్ ఉపాధ్యాయురాలు బి.చిట్టితల్లి అతిథిగా విచ్చేసి చిన్నారులతో వీటిని చేయించారు. కాగితపు మడతలతో పక్షులు, జంతువులు, అక్షరాలు, అంకెలు, వివిధ టోపీలు వంటి ఆకృతులను సులువుగా తయారుచేసే విధానంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఓరిగామి అనేది ప్రాచీన జపనీస్ కళ అన్నారు. విద్యార్థులకు వీటిని నేర్పించడం ద్వారా జ్యామితీయ భావనలు సులువుగా అర్థమవుతాయన్నారు. ఈ కళ విద్యార్థుల్లో చదువుపట్ల ఆసక్తిని పెంచుతుందన్నారు. ఉపాధ్యాయులు తరగతి గదిలో ఈ కళను ఉపయోగించడంద్వారా స్కూల్ డ్రాపౌవుట్స్ తగ్గించే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో భాష్యం స్కూల్ ప్రిన్సిపల్ పి.పేరయ్యనాయుడు, నలమాటి లలిత, సుభాష్ చంద్రబోస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గొప్ప సామాజిక విప్లవ యోధుడు అంబేద్కర్

పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్

ప్రజాశక్తి - నిడదవోలు

గొప్ప సామాజిక విప్లవ యోధుడు అంబేద్కర్ అని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష అన్నారు. కెవిపిఎస్, చర్చ్ పేట యూత్, యువకళా సమితి, పెయింటర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిడదవోలు సంత మార్కెట్ డాక్టర్ బిఆర్.అంబేద్కర్ చౌక్ వద్ద శనివారం అంబేద్కర్ జీవిత చరిత్ర నాటక ప్రదరశన నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీవారు దీన్ని ప్రదర్శించారు. ఈ కారక్రమానికి మంత్రి దుర్గేష్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ భారత దేశాన్ని సర్వ సత్తాక ప్రజాస్వామిక గణతంత్ర రాజ్యంగా ప్రపంచం ముందు నిలబెట్టిన మహనీయులు అంబేద్కర్ అన్నారు. ఎన్నో అననుకూల పరిస్థితులను అనుకూలంగా మార్చుకుని అణిచివేతకు గురవుతున్నవారి గుండెల్లో చైతన్య స్ఫూర్తిని నింపిన ఆదర్శనీయుడు అన్నారు. ప్రపంచాన్ని మార్చగలిగే శక్తి విద్యకు మాత్రమే ఉందని నమ్మి గొప్ప విద్యావేత్తగా ఆయన నడిచిన విధానం అందరికీ ఆదర్శనీయమన్నారు. రాజ్యాంగం ద్వారా మహిళలకు అనేక హక్కులు కల్పించిన ఘనత అంబేద్కర్‌కే దక్కిందన్నారు. ఈ ప్రారంభోత్సవ సభకు కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జువ్వల రాంబాబు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ మల్టీపర్పస్ కమ్యూనిటీ హాల్ చైర్మన్ బయ్యే వెంకటరావు హాజరయ్యారు. అతిథులను న్యాయ వాది నక్కా వెంకటేశ్వరరావు వేదికపైకి ఆహ్వానించారు తొలుత వారు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అంబేద్కర్ జీవిత చరిత్రపై నాటక ప్రదర్శన జరిగింది. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎం.సుందరబాబు, గంటి కృష్ణ, తహశీల్దార్ నాగరాజునాయక్, జిల్లా జాయింట్ రిజిస్ట్రార్ ఆర్.రాంబాబు, ఆర్ఐ బీరా సత్యేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు. రామా బాయి పాత్రదారిని ఎన్‌హెచ్‌ఎం సంఘం రాష్ట్ర నాయకులు దయామణి శాలువతో సత్కరించారు జెవివి నాయకులు దేవేంద్ర, మణికంఠ, వై.పైడయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి కందుల దుర్గేష్

ఆధునిక టెక్నాలజీతో కేసుల పరిష్కారం

ఐజి అశోక్‌కుమార్

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

ఆధునిక టెక్నాలజీతో పాత కేసులను సైతం త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని ఐజి జివిజి.అశోక్‌కుమార్ తెలిపారు. శనివారం ఉండ్రాజవరం పోలీస్ స్టేషన్‌ల్లో ఆయన తనిఖీలు నిర్వహించారు స్టేషన్‌లోని పలు పత్రాలను, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. మండలంలో నేరాల శాతం తక్కువగానే ఉందన్నారు. రాష్ట్ర సరిహద్దు ఒడిశా వంటి ప్రాంతాల నుంచి గంజాయి, మాదకద్రవ్యాల రవాణా జరుగుతుందన్నారు. వాటి నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. సైబర్ నేరాలు తగ్గుముఖం పట్టాయన్నారు. సైబర్ నేరగాళ్లు వృద్ధులపై ఎక్కువగా దృష్టి పెడుతున్నారన్నారు. పోక్సో కేసులో బెయిల్‌పై వచ్చిన వ్యక్తులపై రౌడీ షీట్ ఓపెన్ చేసి, నిరంతరం వారిపై నిఘా ఉంచుతామన్నారు. మహిళలు శక్తి యాప్‌ను స్మార్ట్ ఫోన్లలో ఇన్‌స్టాల్ చేసుకోవాలన్నారు. కేసు వివరాలు అప్‌లోడ్ చేస్తే, పోలీసులే స్వయంగా వారికి రక్షణ కల్పిస్తారన్నారు. కేసుల నమోదుకు టోల్ ఫ్రీ నెంబర్ 1930ను ఉపయోగించుకోవచ్చున్నారు. ఆయన వెంట ఎస్‌పి, డిఎస్‌పిలు, సిఐ, ఎస్ఐ ఉన్నారు. తొలుత స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్టేషన్ ఆవరణలో ఆయన మొక్కను నాటారు.



ఉత్సాహంగా తిరంగా ర్యాలీ

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

నగరంలో తిరంగా ర్యాలీ శనివారం ఉత్సాహంగా సాగింది. మంత్రి కందుల దుర్గేష్, ఎంపీ దగ్గుబాటి పురంధేశ్వరి, ఎంఎల్‌సి సోము వీర్రాజు, జెసి ఎస్.చిన్నరాముడు, ఎంఎల్ఎలు ఆదిరెడ్డి శ్రీనివాస్, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, బత్తుల బలరామకృష్ణ, ముప్పిడి వెంకటేశ్వరరావు, మద్దిపాటి వెంకటరాజు, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణచౌదరి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడారు. పహల్గాం ఉగ్రమూకల దాడిలో అసువులు బాసిన భారత పౌరులకు, పాక్ దాడిలో మృతి చెందిన ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సైనికుడు మురళీ నాయక్ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నానన్నారు. ఆపరేషన్ సింధూర్‌తో భారతదేశ ప్రతిష్టను నెలబెట్టారన్నారు. ఎంపీ పురందేశ్వరి మాట్లాడుతూ తిరంగా ర్యాలీకి తమ సంఘీభావం తెలిపేందుకు వచ్చిన రాజమహేంద్రవరం పుర ప్రజలకు పేరుపేరున కతజ్ఞతలు చెప్పారు. ఎంఎల్ఎ ఆదిరెడ్డి శ్రీనివాసు మాట్లాడుతూ, సైనికుల వెంట తెలుగు ప్రజలంతా ఉన్నారన్నారు. పుష్కరాల రేవు నుంచి కోటి పల్లి బస్టాండ్ వరకూ ఈ ర్యాలీ సాగింది.

కొవ్వూరు : ఆపరేషన్ సింధూర్ విజయం నేపథ్యంలో కొవ్వూరు ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం నుంచి విజయవిహార్ సెంటర్ మీదుగా ఆర్‌డిఒ కార్యాలయం వరకూ 150 మీటర్ల త్రివర్ణ పతాకంతో ఈ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ భారతదేశ అభివృద్ధిని చూసి ఓర్వలేక పాకిస్తాన్ ఉగ్రవాదులను పెంచి పోషించి భారతదేశంపై దాడులకు పురుగొల్పుతుందన్నారు. పెహల్గాం ఘటనకు పాకిస్తాన్‌లోని ఉగ్రవాదులే కారణమన్నారు. వారిని అంతం చేసేందుకే ఆపరేషన్ సింధూర్ సాగిందన్నారు. ఈ కార్యక్రమంలో పిక్కి నాగేంద్ర, భావన రత్నకుమారి, కంటమణి రామకృష్ణ, అల్లూరి నిఖిలేష్ చౌదరి, టివి.రామారావు, సూరపనేని చిన్ని, దాయన రామకష్ణ, సుంకర సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.




ర్యాలీలో పాల్గొన్న మంత్రి కందుల దుర్గేష్, ఎంపీ, ఎంఎల్ఎలు

మధ్యప్రదేశ్ మంత్రి జగదీష్ వ్యాఖ్యలకు ఖండన

ప్రజాశక్తి - నిడదవోలు

దేశం, సైనికులు మోడీ పాదాలకు మొక్కాలన్న మధ్యప్రదేశ్ ఉపముఖ్యమంత్రి జగదీష్ చేసిన విద్వేష వ్యాఖ్యలను సిపిఎం జిల్లా నాయకులు జువ్వల రాంబాబు తీవ్రంగా ఖండించారు. దేశమే ముందు అంటూ నిత్యం నీతులు చెప్పే బిజెపి నేతలు, సంఘ్ పరివార్ మూకలు ఆపరేషన్ సింధూర్ నేపథ్యంగా దేశం కంటే తామే గొప్పవారమన్న రీతిలో రెచ్చిపోతున్నారన్నారు. సరిహద్దుల్లో ప్రాణలొడ్డి దేశానికి రక్షణ కల్పిస్తున్న సైన్యంపై అవమానకర వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. అనుచిత వ్యాఖ్యలు చేసిన మంత్రి జగదీష్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట గండి శ్రీనివాసరావు, కె.ప్రసాద్, ఎం.రాము, శ్రీనివాసరావు, సత్యనారాయణ ఉన్నారు.

కార్టూ'నిజం'



జిల్లాలో 'స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర'

జిల్లాలో శనివారం స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా పరిసరాలను శుభ్రం చేశారు. పలుచోట్ల మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ పరిశుభ్రతను పాటించాలని, ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని అధికారులు, ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో ర్యాలీలు, సమావేశాలను నిర్వహించారు.

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

మొక్కలను పెంచి పచ్చదనాన్ని పంచే కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ వ్యక్తిగత బాధ్యతగా స్వీకరించాలని కమిషనర్ కేతన్ గార్గ్ సూచించారు. 16వ వార్డు ఆవా వాంబే గృహ సముదాయాల వద్ద శనివారం 'స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర'లో భాగంగా 'బీట్ ద హీట్' కార్యక్రమాన్ని నిర్వహించారు. జెసి ఎస్.చిన్నరాముడు, ఎంఎల్‌సి సోమువీర్రాజుతో కలసి ఆయన పాల్గొన్నారు. తొలుత బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమాలను నగరంలో పటిష్టంగా అమలు చేస్తున్నామన్నారు. 'బీట్ ద హీట్' క్యాంపెయిన్ నిర్వహించుకున్నట్లు వెల్లడించారు. వేసవి ఎండల రీత్యా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించడమే కార్యక్రమ ప్రధాన ఉద్దేశమన్నారు. నగరవ్యాప్తంగా ఇప్పటికే 40 చోట్ల చలివేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. పలు ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద వాహనదారులకు ఎండతీవ్రత లేకుండా ఉండేందుకు నెట్లను కూడా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పర్యావరణ పరిరక్షణ, కాలుష్య రహిత సమాజ నిర్మాణ కోసం ప్రతిఒక్కరూ తప్పనిసరిగా ఒక మొక్కను నాటాలన్నారు. జెసి మాట్లాడుతూ వేసవి దృష్ట్యా వడదెబ్బ తగలకుండా ప్రజలందరూ తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఎంఎల్‌సి సోము వీర్రాజు మాట్లాడుతూ స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణ ఆంధ్ర గ్రేడింగ్ లో రాజ మహేంద్రవరం మెరుగైన ఫలితాలు కనబర్చడం సంతోష కరమన్నారు. అనంతరం మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో అడిషినల్ కమిషనర్ పి.వి.రామలింగేశ్వర్, సెక్రటరీ జి.శైలజావల్లి, ఎంజి ఎంసిహెచ్.కోటేశ్వరరావు, ఎంహెచ్ఒ వినూత్న పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ రామచంద్ర ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. బీట్ ది హీట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎండల నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన వివరించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. రెడ్ క్రాస్ విద్యార్థులు చేతుల శుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సస సమన్వయ కర్త, డాక్టర్ శ్రీరామ్మూర్తి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఈసుబ్ భాషా, డాక్టర్ బి.మల్లికార్జున, డాక్టర్ భవాని, డాక్టర్ కె.అనూష పాల్గొన్నారు.



సమిశ్రగూడెంలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, సిబ్బంది

నిడదవోలు రూరల్ మండలంలో సమిశ్రగూడెంలో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. వేసవిలో వేడిమిని తట్టుకునేందుకు, వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను గ్రామసభలో వివరించారు. పంచాయతీ వద్దగల చెరువును శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దేశాబత్తుల జ్యోత్స్నప్రియాంక, తహశీల్దార్ బి.నాగరాజునాయక్, ఎంపిడిఒ డి.లక్ష్మీనరసింహ, ప్రత్యేకాధికారి ఎ.దుర్గేష్, డిపిఆర్‌సి జిల్లా శిక్షణాధికారి జి.ప్రసంగిరాజు, ఎమ్‌డి.అక్రమ్, డి.నాగప్రసాద్, యు.రామ్మోహనరావునాయుడు పాల్గొన్నారు.

పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ తాళ్లూరి ఆంద్రు ఆధ్వర్యంలో తాడిమళ్ల పిహెచ్‌సిలో బీట్ ద హీట్ కార్యక్రమం నిర్వహించారు. పిహెచ్‌సి పరిసరాలను శుభ్రం చేసి మొక్కలు నాటారు. చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు చంద్రమౌళి, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ కోమలి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కడియం శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతులలో భాగంగా శనివారం 'స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణాంధ్ర' కార్యక్రమాన్ని నిర్వహించారు. 'నీరు - మీరు' అనే అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విద్యార్థులకు గ్రంధాలయ సభ్యులు భాస్కరరావు కథలు చెప్పి ఆలరించారు. వారం రోజులుగా నేర్చుకున్న అంశాలపై పోటీలు నిర్వహించారు. లైబ్రేరియన్ శ్రీదేవి నిర్మల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పాఠకులు, ఆశాలు, వైద్య సిబ్బంది, తల్లి దండ్రులుపాల్గొన్నారు.

చాగల్లు మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో బీట్ ది హీట్ కార్యక్రమాన్ని నిర్వహించామని ఇఒపిఆర్‌డి ఎన్.శ్రవణ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ర్యాలీలు నిర్వహించామన్నారు. రోడ్ల ప్రక్కన మొక్కలు నాటుట, ఆరోగ్య శిబిరాలు నిర్వహణ, చలివేంద్రాలు ఏర్పాటు తదితర కార్యక్రమాలు నిర్వహించినట్టు తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, ఎఎన్ఎంలు, ఆశాలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కొవ్వూరులో ఆర్‌డిఒ రాణిసుస్మిత ఆధ్వర్యంలో ఆర్‌డిఒ కార్యాలయంలో స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎండల దృష్ట్యా చలివేంద్రాల ఏర్పాటుతో పాటు, ప్రజలు వడగలుపులకు గురవకుండా తగిన వైద్య సేవలను అందించే విధంగా చర్యలు తీసుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కొవ్వూరు ఆర్‌డిఒకార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు అలాగే ఆర్‌టిసి బస్టాండ్ వద్ద డిపో మేనేజర్ కుమార్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొవ్వూరు మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ సూరపనేని చిన్ని, మున్సిపల్ కమిషనర్ టి.నాగేంద్రకుమార్, జనసేన మండల అధ్యక్షులు సుంకర సత్తిబాబు, ఆర్‌టిసి సిబ్బంది పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

యువకుని మృతదేహం స్వాధీనం

ప్రజాశక్తి – ఆత్రేయపురం

ప్రమాదవశాత్తు కాలుజారి గౌతమీ గోదావరి నదిలో గల్లంతైన యువకుడి మృతదేహం శనివారం రావులపాలెం బ్రిడ్జి వద్ద లభ్యమయింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉండ్రాజవరం గ్రామానికి చెందిన తలపాకుల జగపతిబాబు (20) హైదరాబాదులో ఒక కంపెనీలో ఆఫీస్ బాయ్ గా పని చేస్తున్నాడు. ఆత్రేయపురం బుల్లిపేట లో ఉన్న తన మేనమామ కుమారుడు పుట్టినరోజు వేడుకలకు వచ్చాడు. శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో గౌతమి గోదావరి నది తీరానికి బహిర్భూమికి వెళ్లాడు. ఈ నేపథ్యంలో ప్రమాదవశాత్తు కాలుజారి గోదావరిలో మునిగి గల్లంతయ్యాడు.. స్థానికులు, కుటుంబ సభ్యులు, పోలీసులు గాలింపు చర్యలు చేపట్టినప్పటికీ జగపతిబాబు ఆచూకీ లభ్యం కాలేదు. శనివారం కూడా గాలింపు చర్యలు చేపట్టగా రావులపాలెం జొన్నాడ బ్రిడ్జి వద్ద యువకుడు లభ్యం అయ్యింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ ఎస్.రాము తెలిపారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి – ముమ్మిడివరం

జాతీయ రహదారిపై లారీ ఢీ కొన్న ఘటనలో ఒకరు మృతి చెందారు. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగర పంచాయతీ పరిధి బొండాయి కోడు తూము సెంటర్ పెట్రోల్‌బంక్ ఎదురుగా మోటార్‌సైకిల్‌పై అయినవిల్లి మండలం పోతుకుర్రుకు చెందిన సాగిరాజు సత్యనారాయణ రాజు (47) వెళుతున్నాడు. ఈ సమయంలో అతనిని వెనక నుండి లారీ ఢీ కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అతనిని ప్రయివేటు ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతు మృతి చెందాడు. మృతుడికి భార్య విజయ లక్ష్మి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ మేరకు ఎస్ఐ జ్వాలా సాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పేకాట శిబిరంపై దాడి 8 మంది అరెస్టు

ప్రజాశక్తి–కాజులూరు

గొల్లపాలెంలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై దాడి చేసి ఎనిమిది మందిని అరెస్టు చేసినట్టు గొల్లపాలెం ఎస్ఐ ఎం.మోహన్ కుమార్ తెలిపారు. ఎనిమిది మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద ఉన్న రూ.7,400 నగదు, పేకాట ముక్కలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. వీరిని కోర్టులో హాజరు పరచనున్నట్టు ఆయన తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌పై జరిమానా

ప్రజాశక్తి – జగ్గంపేట

సర్కిల్ పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిని పట్టుకుని కోర్టులో హాజరుపర్చగా జరిమానా విధించినట్లు సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్ తెలిపారు. శనివారం ఆయన మీడియాకు వివరాలను వెల్లడించారు. గండేపల్లి, జగ్గంపేట, కిర్లంపూడి మండలాల పరిధిలో వివిధ ప్రదేశాల్లో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించి 12 మందిని పట్టుకున్నట్టు తెలిపారు. వారిని కోర్టులో హాజరు పరచగా ఏడుగురికి ఒకొక్కరికీ రూ.పది వేల చొప్పున జరిమానా విధించారని, ఐదుగురికి రెండు రోజుల జైలు శిక్ష విధించారని తెలిపారు.



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న రైల్వే పోలీసులు

రైలు కిందపడి జంట ఆత్మహత్య

ప్రజాశక్తి –సామర్లకోట

మండలంలోని వేట్లపాలెం గుడపర్తి రైల్వే ట్రాక్‌పై శనివారం రైలు కిందపడి ఒక జంట ఆత్మహత్యకు పాల్పడ్డారు. మృతులను కాకినాడ స్వర్ణాంధ్ర కాలనీకి చెందిన ఉప్పల పోసుబాబు (37) కాకినాడ సూర్యనారాయణపురానికి చెందిన గెడ్డం దివ్య నాగలక్ష్మి (30)గా పోలీసులు గుర్తించారు. వీరిద్దరు శుక్రవారం రాత్రి కాకినాడ నుంచి బైకుపై సామర్లకోట వచ్చి అక్కడి నుంచి వేట్లపాలెం వెళ్ళి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుని ఉంటారని సామర్లకోట రైల్వే పోలీసులు భావిస్తున్నారు. మృతుని జేబులో సూసైడ్ నోట్, బండి పార్కింగ్ చీటి లభ్యమయ్యాయి. లేఖలో రాసి ఉన్న ఫోన్ నెంబర్లు ఆధారంగా మతుడి బంధువులకు సమాచారం ఇచ్చారు. పోసుబాబు ప్రయివేటు అకౌంటెంట్ కాగా భార్య, ఇద్దరు అబ్బాయిలు ఉన్నారు. వారం రోజుల క్రితం తనకు మరో భార్య ఉందని తనని ఇంటికి తీసుకువస్తానని పోసుబాబు భార్యతో చెప్పడంతో కుటుంబంలో గొడవ జరిగింది. మృతుడి భార్య అమ్మగారి ఇంటికి వెళ్ళిపోయింది. శుక్రవారం రాత్రి తాను చనిపోతున్నానని అందరూ జాగ్రత్తగా ఉండాలని ఫోన్ చేసి మతుడు పోసుబాబు చెప్పాడు. దీంతో ఆ కుటుంబం అంతా కాకినాడ పోలీస్టేషన్‌లో ఫిర్యాదు చేసి గాలించడం మొదలుపెట్టారు. మృతురాలు గెడ్డం దివ్య నాగలక్ష్మి భర్తతో విభేదాలు వచ్చి ప్రైవేటుగా ఉద్యోగం చేస్తూ జీవనం సాగిస్తోంది. ఆమెకు ఒక పాప ఉంది. మృతురాలి తల్లి సామర్లకోట పోలీసులకు వివరాలు అందించారు.

చైన్ స్నాచింగ్ దొంగలతో అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి –కంప

మండలంలో ఇటీవల చైన్ స్నాచింగ్ దొంగతనాలు అధికంగా జరుగుతున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తతఎస్ఐ టి.సునీత తెలిపారు. కరప స్వర్ణ థియేటర్ సెంటర్లో సమీపంలోను స్కూటీపై వెళ్తున్న ఒక అమ్మాయి మెడలో గొలుసును దొంగలించి హీరో హెూండా గ్లామర్ బైక్‌పై ఒక దొంగ పారిపోయాడని తెలిపారు. బైకుపై వెళుతున్న దొంగ ఫోటోలను ఎస్ఐ విడుదల చేశారు. సమాచారం అందించిన వారికి బహుమతి అందిస్తామని, వారి సమాచారం గోప్యంగా ఉంచుతామని ఎస్ఐ టి.సునీత తెలిపారు.

ధాన్యం రైతు కంట కన్నీరు



ప్రజాశక్తి – రాజమహేంద్రవరం ప్రతినిధి

జిల్లాలో వరి రైతుల పరిస్థితి దయనీయంగా మారుతోంది. ప్రతి ధాన్యపు గింజా కొనుగోలు చేస్తామని ప్రభుత్వం చెప్పిన మాటలకు చేతలకు పొంతనే ఉండట్లేదు. ఫలితంగా ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం కళ్లాల్లోనే ముసురుతోంది. ఈ ఏడాది దిగుబడి గణనీయంగా పెరిగింది. ఈ మేరకు కొనుగోళ్లను పెంచాల్సి ఉన్నా.. ప్రభుత్వం అలాంటి చర్యలేవీ తీసుకోలేదు. ముందుగా నిర్ణయించిన లక్ష్యాల మేరకు ధాన్యాన్ని కొనుగోలు చేశారు. అనంతరం కొనుగోలు కేంద్రాలను మూసేశారు. దీంతో మిగిలిన రైతుల వద్ద ఉన్న ధాన్యం కళ్లాల్లోనే ఉండిపోయింది. దీంతో అన్నదాతలు రోడ్డెక్కారు. ఎట్టకేలకు దిగొచ్చిన ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్ల లక్ష్యాలను పెంచింది. స్వయంగా సివిల్ సప్లయిస్ శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ కాకినాడలో ఉమ్మడి జిల్లాల అధికారులతో సమీక్ష చేసి ధాన్యం కొనుగోళ్ల లక్ష్యాన్ని పెంచుతున్నామని చెప్పారు. అనంతరం మంత్రులు, ఎంఎల్ఎలు ప్రెస్‌మీట్‌లు పెట్టి మరీ లక్ష్యం పెంపుపై ఊదరగొట్టారు. కాని ధాన్యాన్ని మాత్రం అనుకున్న మేర కొనుగోలు చేయలేదు. మంత్రులు ప్రకటనల అనంతరం పలుచోట్ల ధాన్యం కొనుగోలు చేయాలంటూ రైతులు మళ్లీ రోడ్డెక్కారు. ధాన్యం లోడు ట్రాక్టర్లతో కొవ్వూరు గామన్ బ్రిడ్జి వద్ద ఉన్న హైవేపై రాస్తారోకో చేశారు. అధికారులు హడావుడిగా ఆయా లోడులను చేరుకుని కొనుగోళ్లు చేస్తామని హామీ ఇచ్చారు తప్ప, పరిస్థితిలో మాత్రం మార్పు లేదు. వాతావరణంలో అకాల మార్పులతో కురుస్తున్న ఆకస్మిక వర్షాలకు రైతుల వద్ద ఉన్న ధాన్యం తడిసిపోతోంది. దీంతో దళారులు చెప్పిన రేటుకు అమ్ముకుని నష్టాలకు గురవుతున్నారు.

మరో పక్క జిల్లాలో వేసవి ఉష్ణోగ్రతలు దారితెప్పిస్తున్నాయి. 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో ప్రజలు అల్లాడుతున్నారు. ఉక్కపోతతో ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. రోహిణీ కార్తెకు ముందే ఎండలు ఇలా ఉండటంతో సర్వత్రా ఆందోళన నెలకొంది. వడగాల్పులు నానాటికి అధికమవటంతో ప్రజలు ఇళ్లనుంచి బయటకు వెళ్లేందుకు వెనకడుగు వేస్తున్నారు. జిల్లాలో వడదెబ్బ మృతుల సంఖ్య కూడా క్రమంగా పెరుగుతోంది. ఉదయం 9 గంటల నుంచే ఎండ తీవ్రత అధికమవుతోంది. దీంతో మధ్యాహ్నం 1 నుంచి 4 గంటల వరకూ జిల్లాలో అనేక ప్రధాన కూడళ్ల నిర్మానుష్యంగా దర్శనమిస్తున్నాయి. పాలనా యంత్రాంగం ఏర్పాటు చేసిన చలివేంద్రాల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. మరో వైపు విద్యుత్ కోతలు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. విద్యుత్ వినియోగం జిల్లాలో 21 మిలియన్ యూనిట్లకు చేరటంతో అప్రకటిత విద్యుత్ కోతలు అనివార్యంగా మారాయి.

ఆధునికీకరణ జరిగేనా?

గోదావరి పంటకాలువల ఆధునికీకరణ పనులు జరుగుతాయా? లేదా?అనేపై ప్రజల అనుమానాలు తలెత్తుతున్నాయి. కాలువలు కట్టేసి 15రోజులు పైబడినా ఎక్కడ ఆధునికీకరణ పనులు మాత్రం కనిపించట్లేదు. ప్రతి ఏటా వేసవిలో కాలువలకు నీటి ప్రవాహాన్ని నిలిపేసిన సమయంలో కాలువల్లో పూడిక తీత, గట్ల మరమ్మతులు వంటి పనులు నిర్వహిస్తారు. వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని బలహీనంగా ఉన్న కరకట్టలకు మరమ్మతు చేయాల్సి ఉంటుంది. కాల్వల ఆధునికీకరణ, తూటు తొలగింపు, గోదావరి డ్రెడ్జింగ్ నిర్వహణ వంటి పనులు ఈ కాలంలోనే చేపట్టాల్సి ఉంది. తాజాగా క్లోజర్ పనులకు ప్రభుత్వం రూ.40 కోట్లు కేటాయించి చేతులు దులుపుకుంది. ఇరిగేషన్ అధికారులు రూ.70 కోట్ల నిధులు అవసరమని ప్రతిపాదనలు పంపినా ప్రభుత్వం పట్టించుకోలేదు. ఈ పనులకు ఇప్పటి వరకూ టెండర్లు కూడా పిలవ లేదు. దీంతో ఈ ఏడాది ఆధునికీకరణ పనులపై సందిగ్ధత నెలకొంది.ఇదే జరిగితే వరదలకు పంటలు ముంపునకు గురవ్వడం, లేదా వర్షాల సమయంలో నీరు వెళ్లక పంటలు పాడవ్వడం తప్పదనే అనుమానాలున్నాయి. ప్రభుత్వం ఇప్పటికైనా సాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని రైతాంగం కోరుతోంది.

కూరగాయల ధరలకు మళ్లీ రెక్కలొచ్చాయి. ఇప్పటికే నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. పెళ్లిళ్ల సీజన్, ఎండాకాలంలో కూరగాయల సాగు తగ్గడంతో కూరగాయల ధరలు క్రమంగా పెరుగుతున్నాయి. వంకాయ, దొండ, కాకర, చిక్కుళ్లు ఇలా ఏ రకం చూసినా కేజీ రూ.80 పైమాటే. అల్లం కేజీ రూ.150కి చేరింది. వెల్లుల్లి పాయలు కేజీ రూ.360 పలుకుతున్నాయి. ధరలు పెరగడంతో కొనుగోలు దారులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. దీంతో కొనుగోలు దారులు బహిరంగ మార్కెట్లో అధిక ధరలకు కొనుగోలు చేయలేక అవస్థలు పడుతున్నారు.

ప్రమాదకరంగా చివటం-తణుకు రహదారి

ప్రజాశక్తి – ఉండ్రాజవరం

మండలంలోని చివటం – తణుకు ప్రధాన రహదారిపై భారీ గుంతలతో ప్రమాదకరంగా మారింది. చినుకు పడితే చాలు గుంతలు వర్షపు నీటితో నిండిపోయి చెరువులను తలపిస్తున్నాయి. ఆ రహదారిపై ప్రయాణం అంటేనే ప్రయాణికులు బెంబేలెత్తుతున్నారు. కె.సావరం, చివటం, టీచర్స్ కాలనీ, అంబికా టవర్స్ మీదుగా జాతీయ రహదారిని అనుకొని నిత్యం తణుకు వైపు పదుల సంఖ్యలో భారీ, చిన్న, ద్విచక్ర వాహనాలు, వందల సంఖ్యలో పాదచారులు ప్రయాణిస్తూ ఉంటారు. అటువంటి రహదారిలో అంబికా టవర్స్ మలుపు వద్ద భారీ గుంతలు వర్షపు నీటిలో నిండిపోయి, ప్రమాదాలను కలిగిస్తున్నాయి. స్థానిక నివాసితులు, ఆ ప్రాంతపు చిరు వ్యాపారాలు పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నప్పటికీ, సమస్యను పరిష్కరించట్లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలకు టీచర్స్ కాలనీకి విచ్చేసిన సమయంలో మంత్రి కందుల దుర్గేష్‌కు సైతం సమస్యపై వినతిపత్రం ఇచ్చామని, అయినా పట్టించుకునే వారు లేరని వాపోతున్నారు. ఉన్నతాధికారులు పరిశీలించి, తగిన చర్యలు తీసుకోవాలనీ , ప్రమాదాల నుంచి కాపాడాలని కోరుకుంటున్నారు.



గోతుల మయంగా మారిన రోడ్డు

ఆకట్టుకున్న పప్పెట్ షో

ప్రజాశక్తి – సామర్లకోట

సామర్లకోట ఆంధ్ర జూబిలీ బాప్టిస్ట్ చర్చిలో వేసవి సెలవుల్లో నిర్వహించే చిల్డ్రన్ బైబిల్ తరగతులు శనివారం ఘనంగా ముగిశాయి. చర్చ్ యువజన సంఘం ఆధ్వర్యంలో వారం రోజులుగా నిర్వహించిన తరగతుల ముగింపు కార్యక్రమం శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు హుషారుగా సాగింది. ఈ కార్యక్రమంలో పిఠాపురం ఏలూరు ప్రాంతాలకు చెందిన ఒక ప్రత్యేక టీమ్ సభ్యులు పాల్గొని పప్పెట్ షోలు, మ్యాజిక్ షోలు, పలు పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టి.అమర్ కళ్యాణ్, టి.అమర్ కిరణ్, ఆర్.నవీన్, డి.ప్రిన్స్, జె.సురేంద్ర, విన్స్, పి.మెల్విన్, బి.వర్షిణిప్రియ, టి.మాలతి, టి.వాణి, దయా ప్రకాషిణి, కుమారి, బి.కశ్యప్, బి.అరుణ, కిరణ్ కుమారి పాల్గొన్నారు.

ఎయిడ్స్ నివారణపై అవగాహన

ప్రజాశక్తి–కాకినాడ రూరల్

స్థానిక జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం వద్ద రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, జిల్లా ఇంటిగ్రేటెడ్ స్ట్రేటరీ ఫర్ హెచ్ఐవి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర– స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా ఎయిడ్స్, అధిక రక్తపోటు పై వీధి నాటకం ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి డిఎంహెచ్ఓ నరసింహ నాయక్ మాట్లాడుతూ అధిక రక్తపోటుపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. వైద్యుల సూచనల మేరకు మందులు వాడుతుంటే జీవితకాలం వాటిని వేసుకోవాలన్నారు. అనంతరం కళాకారులు ఎయిడ్స్, సుఖ వ్యాధులు, కండోమ్ ఉపయోగం వంటి వాటిపై అవగాహన కల్పించారు. ఆర్.రమేష్, ఎంవి రత్నరాజ్, రాజా, మోహన్, సుబ్బారావు పాల్గొన్నారు.

అప్పలరాజుకు వైసిపిలో జిల్లా పదవి

ప్రజాశక్తి–ఏలేశ్వరం

యర్రవరం గ్రామ సర్పంచ్ బిశెట్టి అప్పలరాజుకు వైసిపిలో జిల్లా పదవి లభించింది. ఆయనను జిల్లా కార్యాచరణ కార్యదర్శిగా నియమిస్తూ ఉత్తర్వులు అందాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు పదవి రావటానికి కృషి చేసిన వైసిపి పొలిట్ బ్యూరో సభ్యుడు ముద్రగడ పద్మనాభం, ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముద్రగడ గిరిబాబుకు అప్పలరాజు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ తనకు అప్పగించిన బాధ్యతలను నెరవేర్చేందుకు కృషి చేస్తానని తెలిపారు.

వల్లభ స్వామికి రూ.2.97 లక్షల ఆదాయం

పెద్దాపురం : తిరుపతి గ్రామంలోని శృంగార వల్లభ స్వామి ఆలయానికి శనివారం రూ.2,97,980 ఆదాయం సమ కూరిందని ఆలయ కార్యనిర్వహణాధికారి వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. వివిధ దర్శనం టిక్కెట్ల ద్వారా రూ.1,96,710, అన్నదాన విరాళాల ద్వారా రూ.69,735, కేశఖండన ద్వారా రూ.8200, తులాభారం ద్వారా రూ.400, లడ్డు ప్రసాద్ ద్వారా రూ.22,935 వచ్చిందన్నారు. యాత్రికులకు ఉదయం పులిహోర ప్రసాదం, మధ్యాహ్నం మహా అన్నదానం నిర్వహించామన్నారు ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి నారాయణాచార్యులు, ఆలయ సిబ్బంది, స్వచ్ఛంద సేవకులు, గ్రామస్తులు యాత్రికులకు సేవ లందించారన్నారు.

ర్యాంకులు సాధించిన విద్యార్థికి సత్కారం

శంఖవరం : సిబిఎస్ఇ పరీక్షల్లో ఉత్తమ ర్యాంకు సాధించిన విద్యార్థిని ప్రత్తిపాడు ఎంఎల్ఎ వరుపుల సత్యప్రభ సత్కరించారు కొంతంగి గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు బద్ది లోవరాజు కుమారుడు శశి వెంకట్ ఇటీవల జరిగిన పదో తరగతి సిబిఎస్ఇ పరీక్షల్లో 484/500 మార్కులు, ఎపి రెసిడెన్షియల్ జూనియర్ కాలేజ్ కామన్ ఎంట్రన్స్ సెట్‌లో రాష్ట్రస్థాయిలో ద్వితీయ ర్యాంకు, పాలిటెక్నిక్ కామన్ ఎంట్రెన్స్ టెస్టులో రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకు సాధించాడు. విద్యార్థి సాధించిన ర్యాంకులతో నియోజవర్గంలో యువకులకు స్ఫూర్తి నింపాడని, బస్సు సౌకర్యం కూడా లేని గ్రామం నుంచి విద్యాభ్యాసం కొనసాగించి, రాష్ట్రస్థాయిలో ర్యాంకులు సాధించడం అద్భుతమైన విషయం అన్నారు.

పలువురికి శేషారావు పరామర్శ

నిడదవోలు రూరల్ : నిడదవోలు మండలం తాడిమళ్ళ, కంశాలిపాలెం, గోపవరం గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన పలువురి కుటుంబాలను టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎంఎల్ఎ బూరుగుపల్లి శేషారావు శనివారం పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. మృతులకు సంతాపం తెలిపారు. ఆయన వెంట ఎంపిటిసి మాజీ సభ్యులు కె.చంద్రమౌళి, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

వైసిపి ఆర్గనైజింగ్ కార్యదర్శిగా అంకంరెడ్డి

రౌతులపూడి : వైసిపి జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శిగా టని ములగపూడి మాజీ సర్పంచ్ అంకంరెడ్డి సతీష్ కుమార్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు ఈ పదవి రావడానికి సహకరించిన మాజీ మంత్రి, వైసిపి రాష్ట్ర పోలిట్ బ్యూరో సభ్యులు ముద్రగడ పద్మనాభం, పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్చార్జ్ ముద్రగడ గిరిబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. సతీష్ కుమార్‌ను జెడ్‌పిటిసి గొల్లు లక్ష్మణ మూర్తి, వాసిరెడ్డి జమీలు, సర్ణం శ్రీనివాస్ అభినందించారు.

50 శాతం సబ్సిడీపై దాణా పంపిణీ

ప్రజాశక్తి – చాగల్లు

చాగల్లు మండలంలో పాడి రైతులకు 50శాతం సబ్సిడీ ద్వారా పశువుల దాణాను అందిస్తున్నామని పశువైద్యులు డాక్టర్ యు.ముఖేష్ తెలిపారు. ముందుగా రైతువాటా చెల్లించి నమోదు చేసుకున్నవారికి శనివారం దాణాను అందించామని తెలిపారు. 50 కేజీల దాణా బస్తా యూనిట్ ధర రూ.1,110 కాగా సబ్సిడీపై రూ.555 అందిస్తున్నామన్నారు. భారత్ పశుధన్ యాప్‌లో నమోదు చేసుకున్న తెల్ల రేషన్ కార్డు గల రైతులకు ఈ సబ్సిడీ దాణా పథకం వర్తిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో చాగల్లు మండలంలో 184 మంది పాడి రైతులకు 9,200 కేజీల దాణా సరఫరా చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు, తహశీల్దార్ ఎం.మెరికమ్మ, పశు వైద్యులు ఎం.రాజేష్, సిబ్బంది పాల్గొన్నారు.

27 వరకూ రైల్వే గేటు మూసివేత

ప్రజాశక్తి–చాగల్లు

చాగలు మండలం దారవరం రైల్వే గేటును ఈనెల 21వ తేదీ వరకు మూసివేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. గేటు వద్ద ట్రాక్ మరమ్మతుల నిమిత్తం గేటును మూసివేస్తున్నామన్నారు. దీన్ని ప్రజలు గుర్తించి సహకరించాలని కోరారు. ఇదిలా ఉంటే గేటు మూసేయడంతో దారవరం, మార్కొండపాడు, బ్రాహ్మణ గూడెం ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు.

చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి – చాగల్లు

చాగల్లు మెయిన్ రోడ్ శ్రీకాకతీయ కళ్యాణ మండపం సెంటర్ వద్ద చాగల్లు మండలం మానవత స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో ఉచిత మజ్జిగ పంపిణీ కొనసాగుతోంది. శనివారం దాతలు అగర్వాల్ నారాయణ, పుష్ప దంపతులు, శ్రీరాజరాజేశ్వరీ విద్యాలయ కరస్పాండెంట్ వల్లిపల్లి వెంకటరామారావు, అమ్మాజీ వివాహ వార్షికోత్సవం, గ్రంధి వెంకటేశ్వరరావు, రోజారేణుక పెళ్ళి రోజు సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి మజ్జిగను పంపిణీకి సాయం అందించారు. గ్రామ పంచాయతి సహకారంతో చలివేంద్రం 49వ రోజుకు చేరుకుందనిఛైర్మన్ జుజ్జవరపు వెంకటకృష్ణప్రసాద్ తెలిపారు

దాహార్తిని తీర్చేందుకు దాతలు రావాలి

ప్రజాశక్తి – రాజమహేంద్రవరం

వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు దాతలు ముందుకు రావాలని కమిషనర్ కేతన్ గార్గ్ పిలుపునిచ్చారు. నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఎండలను దృష్టిలో ఉంచుకుని చలివేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. స్థానికులతోపాటు నగరానికి ఇతర ప్రాంతాల నుంచి రాకపోకలు సాగించే ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు ఈ చలివేంద్రాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. దాతలు కూడా చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఇ ఎంసిహెచ్.కోటేశ్వరరావు, ఇఇ మాధవి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సర్వేను సక్రమంగా నిర్వహించాలి

ప్రజాశక్తి – రాజమహేంద్రవరం

వికలాంగుల సర్వేను సమగ్రంగా నిర్వహించాలని జిల్లా సమగ్ర శిక్షా అడిషనల్ ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ ఎస్‌సుభాషిణి ఐఇఆర్‌పిలను ఆదేశించారు. మే 13 నుంచి జూన్ 9 వరకు ఈ సర్వే జరుగుతుందన్నారు. విద్యార్థుల సర్వే, ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ 2025 భాగంగా కొవ్వూరు సుబ్రహ్మణ్యం ఘాట్ సమీపంలో జరుగుతున్న సర్వేను ఆమె శనివారం పరిశీలించారు. బడి ఈడు పిల్లలను తప్పనిసరిగా పాఠశాలలో చేరేలా చూడాలని ఇఆర్‌పిలకు సూచించారు. ఆమె వెంట జిల్లా సహిత విద్యా సమన్వయకర్త ఎన్. కనకబాబు, కొవ్వూరు ఐఇఆర్‌పి రామచంద్రరావు, అరుణ కుమారి, అంగన్‌వాడీలు ఉన్నారు.

రిజర్వేషన్లు 75 శాతానికి పెంచాలి

ప్రజాశక్తి – పెద్దాపురం

ఎస్‌సి, ఎస్‌టి, బిసి వర్గాల అభ్యున్నతి కోసం రిజర్వేషన్లను 50 నుండి 75 శాతానికి పెంచాలని జాతీయ సామాజిక న్యాయ పోరాట సమితి నాయకులు వడ్డి కామరాజు, ఆకుమర్తి సత్యనారాయణ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక కొండయ్యపేట కమ్యూనిటీ హాల్లో నిర్వహించిన సామాజిక న్యాయ పోరాట సమితి సమావేశంలో వారు మాట్లాడారు. కార్మిక చట్టం 1979 ప్రకారం అన్ని రంగాల పరిశ్రమలలో ఉన్న కార్మికులకు చట్టపరమైన రక్షణ సదుపాయాలు కల్పించాలన్నారు. ఈ సమావేశంలో సంకు దావీదు రాజు, నల్లమాటి సురేష్, గుండుబోయిన నాగేశ్వరరావు, వేమగిరి ప్రసన్నకుమార్, ఎం.రుద్రయ్య, లంక నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు కుట్టు శిక్షణ ప్రారంభం

ప్రజాశక్తి – సీతానగరం

సీతానగరంలో మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని శనివారం ఎంఎల్ఎ బత్తుల బలరామకృష్ణ ప్రారంభించారు. ఎంపిడిఒ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. మహిళలకు స్వయం ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. బిసి కార్పొరేషన్, ఇడబ్ల్యుఎస్ సహకారంతో ఈ శిక్షణ అందిస్తున్నామన్నారు. టైలరింగ్‌లో శిక్షణ పొంది స్వయం ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని మహిళలకు సూచించారు. 'నా సేన కోసం నా వంతు' రాష్ట్ర కమిటీ కో–ఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి మాట్లాడుతూ మహిళలకు దీన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మూడు నెలల పాటు శిక్షణ పొందిన తర్వాత ఉచితంగా కుట్టు మిషన్లు అందజేస్తారని తెలిపారు. శిక్షణ కాలంలో 75 శాతం హాజరు ఉన్నవారికి సర్టిఫికెట్‌తో పాటు రూ.1,500 నగదు బహుమతి అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ భారతి, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కందికట్ల అరుణకుమారి, ఎంపిపి గుర్రాల జ్యోత్స్న, కూటమి నాయకులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

ప్రజాశక్తి రాజమహేంద్రవరం రూరల్



పెట్రోల్ బంకుల్లో నాణ్యతా ప్రమాదాలు పాటించాలని, లేకుండే చర్యలు తీసుకుంటామని జిల్లా లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ శివబాలాజీ అన్నారు. ప్రపంచ లీగల్ మెట్రాలజీ దినోత్సవాన్ని పురస్కరించుకుని వారోత్సవాల్లో భాగంగా శనివారం సెంట్రల్ జైల్ ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ వద్ద వినియోగదారులకు అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా లీగల్ మెట్రాలజీ ఇన్స్పెక్టర్ శివబాలాజీ, జిల్లా వినియోగదారుల రక్షణ మండలి సభ్యుడు గొట్టిముక్కల అనంతరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శివ బాలాజీ మాట్లాడుతూ ప్రతీ వినియోగదారుడు పెట్రోలు నాణ్యత, పరిమాణం సరి చూసుకోవాలని సూచించారు. ఫిర్యాదులేమైనా ఉంటే 1967 కు నేరుగా ఫిర్యాదు చేయాలన్నారు. అనంతరావు మాట్లాడుతూ వినియోగదారుల రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ప్రతీ పెట్రోలు బంకులో మంచి నీరు, మరుగు దొడ్లు, గాలి, ఫస్ట్ ఎయిడ్ కిట్ వంటివి ఉచితంగా అందించాలన్నారు. ఫిర్యాదులు ఉంటే 1915కు గానీ కంపెనీ సేల్స్ ఆఫీసర్, సివిల్ సప్లయిస్ అధికారి, లీగల్ మెట్రాలజీ అధికారికి ఫిర్యాదు చేయాలని సూచించారు. అనంతరం అధికారులు బంకులో తనిఖీలు నిర్వహించారు. బంకు సిబ్బంది, వినియోగదారులు పాల్గొన్నారు.

నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు

ప్రజాశక్తి – సీతానగరం

మండలంలోని పురుషోత్తపట్నంలో శనివారం కురిసిన భారీ వర్షం బీభత్సం సష్టించింది. కుండపోత వర్షానికి, ఈదురు గాలులకు విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. ఓ భారీ తాడిచెట్టు కూడా నేల కొరిగింది. విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. దీంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ ప్రమాదాల్లో ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదు. సమాచారం అందుకున్న విద్యుత్ శాఖ అధికారులు, రెవెన్యూ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. తాడిచెట్టును తొలగించి, విద్యుత్ సరఫరాను పునరుద్ధరించే పనులు చేపట్టారు.

కల్వర్టును నిర్మించాలి

ప్రజాశక్తి – గోపాలపురం



స్థానిక గాంధీ బొమ్మ, సాయిబాబా గుడికి వెళ్లే సిమెంటు రోడ్డులో ఉన్న కల్వర్టు స్లాబ్ కుంగి పోయి ప్రమాదకరంగా మారిందని, వెంటనే ఇక్కడ నూతనంగా కల్వర్టును ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఈ కల్వర్టు శిథిలమై రంధ్రాలు పడిందన్నారు. భారీ వాహనాలు వెళ్లడంతో కల్వర్టు స్లాబ్ మీటర్ వెడల్పుకు పైగా కుంగిపోయిందన్నారు. రెండేళ్లయినా నేటికీ ఎలాంటి చర్యలూ తీసుకోలేదన్నారు.కనీసం ఆ ప్రాంతంలో ప్రమాదాలు జరగకుండా హెచ్చరిక బోర్డులు పెట్టిన దాఖలాలు కూడా లేవన్నారు. ఇదే రోడ్డులో ఒక ప్రైవేట్ పాఠశాల ఉంది. ఆ పాఠశాలకు వెళ్లే విద్యార్థులు, సాయిబాబా గుడికి వెళ్లే భక్తులు ఈ కల్వర్టు మీదుగానే రాకపోకలు సాగిస్తుంటారు. దీంతో ఇక్కడ ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి వెంటనే నూతన కల్వర్టు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.